రవి చెంప ఛెళ్ళుమన్నది.

దెబ్బకు గుడ్లళ్ళ నీళ్ళు తిరిగినాయి. పాల పొంగోలె కోపం తన్నుకచ్చింది.

"నన్నే కొడుతావె ముండ" అని లచ్చిమి శికెంటికలు పట్టి ఇయ్యరమయ్యర జంపిండు రవి.


పెండ్లయినంక లచ్చిమి పెనిమిటితోని తన్నులు తినుడు ఇదే శిమాంట. పెండ్లాన్ని కొట్టిన కోపంలనే రవి, ఎదురుగ్గున్న చాటను తంతె అన్లున్న బియ్యం ఇళ్లంతయినయి. మంటరమంట నోటికచ్చిన బూతులు తిడుతూ ఇంట్లకెళ్లి సయ్యసయ్య బయటికొచ్చిండు రవి. బస్టాండ్ బాటబట్టి ఓటలుకాడ ఆగిండు. జేబులున్న ఐదు రూపాయలతో అటుకులు బుక్కి కడుపునిండ నీళ్లు తాగిండు. అన్నే ఆళ్లతో, ఈళ్లతో ముచ్చటబెట్టి నాత్రి పొద్దుబోయినంక ఇంటికొచ్చేటాలకు ఎట్లపడ్డ బియ్యం అట్లనే ఉన్నయి.

లచ్చిమి ఓ మూల ముల్సుకొని పన్నది.

"నీ యవ్వ... దీన్ని మందలించుడే బర్కద్దక్కువ" అంటూ రవి ఇంట్లున్న నులక మంచం బయటేస్కొని నడుం వాల్చిండు.

నెలకాన్నించి వాళ్లింట్ల ఇదే లొల్లి. పెళ్లాం మొగలకు ఒక్క క్షణం పడ్త లేదు.

"పని మీద మనసు బోతలేదు" అని లోపల్లోపల అనుకున్న రవి కండ్లుదెర్సి జూసేటాలకు సుక్కలు గజిబిజిగ కనిపించినయి. "నా జీవితం లెక్కనే అవున్నయి" అని గొణుక్కుంటున్న రవికి



ఎన్కటి సంగతులన్నీ గుర్తుకు రాబట్టినయి.

** ** **

రవి ఊరు నాగారం...

సూడముచ్చటగ ఉండేది.

ఊరి మొదట్లనే బడి. బడి చుట్టూత చెట్లు.

ఆడుకునేందుకు పట్టేంత జాగ.

"నీకెందుకురా! సదువు" అని నాయన నర్సయ్య పదేళ్లచ్చే వరకు రవి ని బడికి పంపియ్యలేదు.

పట్నంల చదువుతున్న బాల్లింగం అప్పయ్య కొడుకు రమేషుడు కోప్పడితే, నాయన రవిని బళ్లె జేర్పించిండు.

వాళ్ల నాయన బట్టలమ్మ రోజూ పరకాల పోయెటోడు. అవ్వ రాజవ్వ కైకిలికి పోయేది. ఊళ్లెకు పోయి ఏం తేవాలన్నా రవినే తోలిత్తురు. "శాలోల్ల రవిగాడు ఉషారుగున్నడు" అని ఇంటిపక్క నర్సవ్వ అన్నప్పుడల్లా ఉబ్బిపోతుండెటోడు.

** ** **

రాధక్కంటే రవికి పానం.

వాళ్ళ నాయన అక్క సారక్క కొడుక్కే ఇచ్చి పెండ్లి చేసిండు.

నాగారం తాళ్లు దాటినంకున్న రంగాపురంలనే రాధక్కోళ్లుండేది.

పెండ్లయినంక యాడాదికి రాధక్కకు బిడ్డ పుట్టింది. చిన్న బుజ్జి అచ్చం అక్కోలనే ఉన్నది. దాన్ని సూత్తాంటే సూడబుద్దయ్యేది. చిన్న బుజ్జిని చూసేందుకన్న తాపతాపకు రవి రంగాపురం పోయటోడు.

అన్నే లచ్చిమితోని దోస్తయింది. అప్పుడు చిన్నగా ముద్దుగుండేది.

అక్కోళ్ల ఇంటిపొంటనే లచ్చిమోళ్ల ఇల్లుండేది. అది అక్కోళ్లింటికి ఊకచ్చేది. అదీ, రవి ఆడుకుంటాంటే వాళ్ళకు పొద్దుగూకినా తెల్వకపోయేది.

"రంగాపురం ఊకెపోతె నాయన కోప్పడతడు" అని వాళ్ళ అవ్వ లొల్లి పెట్టేది. రవి నాయనకు తెల్వకుంట రంగాపురం పొద్దుగాలబోయి, పొద్దూకమళ్ల ఇంటికచ్చెటోడు. కాలం గడ్తాంటె రవి లచ్చిమిని సూసేటందుకే రంగాపురం పోవుడు పెట్టిండు. రాధక్క వట్టిగనే పసిగట్టింది.

'ఏందిరో... తెనుగోళ్ల లచ్చిమితో సోబతి" అని ముసిముసి నవ్వులు నవ్వేది.

పదో తరగతి పట్టేటాలకే రవికి మీసాలు మొలిసినయి. "అవ్వ...నేను చదవనే" అని లొల్లిపెడితె, "గట్లంటె ఎట్లరా బిడ్డా, నాయన కోపం జేస్తడు" అని బుజ్జగించేది.

రవికి ఏదో పని చెప్తున్నరు. రవికి రాధక్క ఇంటికి పోవుడు కుదుర్త లేదు.

ఓరోజు లచ్చిమి సయ్యసయ్య రవి వాళ్ల ఇంటికచ్చింది.

"నన్ను యాదిమర్సినావా? అని గద్దించింది.

"మా అయ్య పెండ్లి సంబంధాలు సూత్తాండు, నాకైతే నిన్నే పెండ్లి చేసుకోవాలని కాయిసుంది. నువ్వు ఏమైనా జేయి" అని లచ్చిమి ఏడ్సుడు మొదలు పెట్టింది.

రవికి ఏం చేయాల్నో మనసున పట్టలేదు. ఎవరు లేకుండా చూసి "నేను ఏదో ఒకటి జేత్తపోవే" అని జెప్పిండు.

లచ్చిమి కండ్లల్ల నీళ్లు పెట్టుకొని అక్కడ్నుంచి కదిలింది. వాళ్ల ఊరికి వెళ్ళిపోయింది.

రవి "తన కన్న లచ్చిమే నయం. తనకు గంత ధైర్యం రాకపాయె" అనుకున్నడు. ఏదన్న ఒకటి చేయాలె అనుకున్నడు. ఏం జేయాల్నో తోస్తలేదు.

** ** **

లచ్చిమి వచ్చిపోయికాన్నించి రవి మనసుల మనసు లేదు.

"ఏం పని చేస్కొని బతుకుతావురా!" అని అవ్వా నాయన రోజు గులుగుతనే ఉన్నరు.

"ఏదో ఒక పని జేసుక బతుకుత" అని బొంకుతనే ఉన్నడు రవి.

రవి దోస్త్ రాజుగాడు, నరేష్‌గాడు పరకాల పూర్ణ టాకీసుల మ్యాట్నాటకు చిరంజీవి సిన్మా సూడపోతాంటే, అవ్వను పైసలడుక్కొని రవి కూడా వాళ్లతో పోయిండు. సిన్మా సూత్తంటె కూడా మనసు నిమ్మలం గాలె.

ఇంటర్వెల్లుల చిన్నప్పటి దోస్తు రాయేశడు కలిసిండు.

సిన్మా సూసుడయినంక రవి మళ్లత్తనని రాజుగానికి చెప్పి, రాయేశుడు తోని అతని రూముకు పోయిండు. వాడు పొద్దుగాల అందుకున్నది రవి

కింత పెట్టి, వాడింత తిన్నడు. చింతపండు తొక్కేసిండు... కమ్మగున్నది. తిన్నంక ఇద్దరం కూసొని ముచ్చట్లల్లపడ్డం. ఎంత దాద్దామనున్నా, రవి లచ్చిమి సంగతి చెప్పిండు.

అంత ఇన్నంక "మీరు పెండ్లి జేసుకునుడే కరక్టు" అని రాయేశడు చెప్పిండు.

"మరి ఎట్ల జేసుకునుడురా?" అని అడిగిండు రవి.

రవి "మానాయన మంచోడు గాదు, లచ్చిమి అయ్యవ్వలు తక్కువేంగాదు ఎట్ల!"అని రవి తనలోని భయాలన్ని రాయేశయానికి చెప్పుకున్నడు."ఇక్కన్నే ఏదన్న పని చూస్కో మా సేటునడిగి పరకాల్నే ఎక్కనన్న దుకాన్ల పనిజూత్తతియి" అని రాయేశడు నమ్మకంగ జెప్పిండు.

** ** **


హోలీ పండుగచ్చింది.

ఏట రాధక్కోళ్లు తీర్థం పోతరు.

అవ్వను, నాయనను రమ్మనుమని మతులావు పంపింది. నాయన బట్టల బ్యారం బోయి రాలేదు.

అవ్వకు పానం మంచిగ లేక రవిని పొమ్మన్నది.

మబ్బుల లేసి రంగాపురం పోయిండు. మొఖం కడుక్కుటాంటె లచ్చిమి కనిపించింది. రవిని చూసి తనకోసమే వచ్చినట్లు నవ్వింది.



వనభోజనానికి ఊరు ఊరంతా ఎడ్ల బండ్లు కట్టుకొని కోటంచ బయలుదేరింద్రు.

రాధక్క పాలోళ్ల బండ్లన్నీ కోటంచల ఒక్కకాడ దించుకున్నరు.

వాళ్లు దిగిన మామిడితోటలనే అటు పంటి లచ్చిమి వాళ్లు దిగిండ్లు.

అందరూ దేవున్ని పెట్టుకునే పనుల్ల ఉన్నరు. మొక్కులన్నీ అయినంక, కల్లు దెప్పించుకున్నరు. మామిడితోటల దిగినోళ్లందరు... ఎవలికాడ వాళ్లు గుంపుగ కూసొని గుడాలు బుక్కుకుంట, కల్లు తాగుడు మొదలు పెట్టిండ్లు.

రవి వాళ్ల బావోళ్ల అన్న సాంబయ్యబావ నాటు కొట్టినట్టున్నడు...అప్పుడే పెద్దక్కను నానాబూతులు తిడుతాండు.

రవి గుడాలు బుక్కి, "కూసోర, కూసోర" అని బావ అంటాంటె కూడా "ఇప్పుడే అత్త బావా" అనుకుంట తోట బయటికి పోయిండు. ఎవల తాగుడు మీద వాళ్లున్నరు.

రవి లేసుడు సూసి లచ్చిమి కూడా బయటికచ్చింది. కండ్లతోనే అన్ని మాట్లాడుకున్నరు.ఇద్దరు గుడికాడ కల్సుకున్నరు. నర్సిమ్మసామి దేవునికి మొక్కిన్రు. ఆన్నుంచి బస్సుకాడికచ్చి పరకాల బస్సెక్కిన్రు.

సక్కగ రాయేశడి రూంకి పోయింద్రు.

రాయేశంకు ఏం చెప్పకముందే, అన్నీ అర్థమైనట్లు వంట జేసుడు మొదలుపెట్టిండు.

"మీరు ఇక్కడుండుడు మంచిదిగాదు"అని ఆ రాత్రే వాళ్లను,వాళ్ల చిన్నమ్మన్న దామెర బస్సెక్కిచ్చిండు.

** ** **

కోటంచ మామిడి తోటల తాగుడు లొల్లి ఒడిసెటాలకు పొద్దుగూకింది. బండ్లు కట్టేటోళ్ల బండ్లు గడుతాన్లు. ఆడోళ్లు సంచులు సదురుతాన్లు.

"అరే రవిగా!... ఓరి రవిగా!" అంటూ రాధక్క రవికోసం తోటంతా వడబోసింది.

ఈశ్వరవ్వ కూడా "బిడ్డ... లచ్చిమి ఏడికి పాయె" అని వెతుకుడు మొదలుపెట్టింది. ఏమి జేసుడని సప్పుడు జేయకుంట సామాన్లు సదురుతాంది.

"రవిగాడు ఏడే" అని పెనిమిటి రాజేశం అడిగితే "ఎటో పోయిండోనే" అని బొంకింది.

"పోరడు చెప్పకజేయక రంగాపురం పోయిండానే" అంటూ రాజేశం, రవిని వెతుక్కుంటూ గుడికాడికి పోయిండు. ఏడ లేడని తెల్సినంక మళ్ల మామిడి తోటకాడికి వచ్చిండు.

"రవిగాడు అవులగాడెనె, చెప్పకుంటనే పోయిండేందె? వాడు మళ్ల రానియ్య చెపుత!" అని రాజేశం, రాధక్క మీద చిర్రుబుర్రులాడిండు.

లచ్చిమి కోసం వాళ్ల అయ్యవ్వ కోటంచల తిరగని చోటు లేదు.

రాధక్క పాలోళ్లకు అప్పుడప్పుడే అర్థమైతాంది.

రవిగాడు ఊకూకె రాధక్కింటికి వచ్చుడు, లచ్చిమి, రవిగాడు కని పిత్త లేదని తెల్సుడుతోటె...

"గిట్లయితదని నేను గప్పుడే అనుకున్న" అని బుజ్జవ్వ కడుపులున్నదంత కక్కింది.

అమ్మలక్కలు తలోమాట అనుడు తోటి లచ్చిమి అయ్య జంపయ్యకు నలుగుట్ల తలకోసేసినట్టయింది.

"ఎదిగిన పోరి ఎటుపోతాందో, ఎటత్తాందో చూడవే... లంజె" అంటూ భార్య ఈశ్వరవ్వను ఎట్లబడితె అట్లనే కొట్టిండు. జాతరబోయిన సంబరమే లేకుంటయింది. జంపయ్యకు తాగిందంత దిగింది.

ఈశ్వరవ్వ ఒకటే ఏడ్సుడు.

బండ్లన్నీ రంగాపురం జేరుకునేటాళ్ల కు రాత్రి పొద్దుబోయింది.

ఆ రాత్రి కూడా ఊళ్ల ఏడ జూసినా ఇదే ముచ్చట.గిట్లనటగాదె అంటే గిట్లనటని ఆడోళ్లంతా చెప్పుకున్నరు.

"వాడు ఎక్కడున్నడో దొరకబట్టి నరికి పోగులుపెట్టుడే" అని జంపయ్య ఒంటికాలిపై లేత్తాండు.

రాజేశం మీద దుమ్మెత్తిపోసిండు.

"సత్తెపమాణకంగ నాకేంతెల్వదె జంపన్న, రవి గాన్ని నువ్వేం జేసిన అడ్డురానె" అని రాజేశం పక్కకు తప్పుకున్నడు.

రాధక్కకు కడుపుల అగుళ్లగుబుళ్లు అయితాంది.ఆ నాత్రే సాకలి పోచి గానితో నాగారంలున్న అవ్వకు, నాయనకు మతులావు పంపింది. పోచిగాడు నాగారం బోయచ్చి "ఆడ రవి, లచ్చిమి లేరు" అని చెప్పేటాలకు రాధక్క పానం పానంల లేదు. నిద్రపోలే, ఆ నాత్రి ముచ్చటతోనే ఊళ్లో తెల్లారింది.

జంపయ్య తన కులపోళ్లను జమ జేసుకొని నాగారం పోయిండు.

అప్పటికే సంగతి తెలిసిన నర్సయ్య తల పట్టుకున్నడు.

"రవిగాడు గిట్లజేసెనేందె, వాళ్లత్తె ఏం జేసుడే" అని రాజవ్వపై కోపం జేసిండు. "ఇళ్లని అత్తె రవిగాని కాళ్లు నరుకుతా ఆగు" అని అక్కలముక్క లం తిట్టిండు.

"పోరడు ఉసారుగున్నడనుకుంటే, గిట్ల జేత్తడని అనుకోలేదవ్వ" అని ఇంటిపక్క నర్సవ్వ ముక్కుమీద వేలేసింది.

రాజవ్వకు కాళ్లు సేతులు ఆడుతలేవు.

నర్సయ్య కోపం సల్లారక, ఇంట్లనే అటుఇటు తిరుగుతాంటె, జంపయ్య తన కులపోల్లతోని రానే వచ్చిండు.

"ఏందే నర్సన్న, గిదేనానె పద్ధతి, ఇంట్లున్నోళ్లను బయటేసుడు" అంటూ జంపయ్యోల్ల కులం పెద్దమనిషి సారయ్య నిదానంగానే అడిగినా ఆ స్వరంలోని తీవ్రత స్పష్టంగా కనిపిస్తుంది.

వాళ్లతోని అల్లుడు రాజేశం కూడా వచ్చుడుతోటి నర్సయ్యకు కొంచెం ధైర్యం వచ్చింది.

"సూడె సారన్న, పోరడు గిట్లజేత్తడని నాకేందెల్సె, వాడు గిట్లజేసుడైతె తప్పే" అంటూ నర్సయ్య నాకేం తెల్వదన్నట్లు చెప్పుకొచ్చిండు.

"వాళ్లను పంపించినవు, ఏమి ఎరగనట్టు ఉన్నావురా బాడ్కవు" అంటూ జంపయ్య బండబూతులు తిట్టిండు.

"నా గ్రాచారం సక్కగలేకనే గిట్లయింది" అని నర్సయ్య ఒక్కటే ముచ్చటజెప్పి సప్పుడు జేయక ఉన్నడు.

నర్సయ్య మామ పరేషాన్ల పడుడు సూడలేక రాజేశమే అన్నీ మాట్లాడి... "అందరం గలిసి వాళ్లను ఎతుకుదాం" అని జంపయ్యకు నచ్చజెప్పిండు. వాళ్లు కోపంతోనే మళ్ల రంగాపురం పోయిండ్లు. తెలిసిన చుట్టాలిల్లలకు మతులావుపెట్టిండ్లు.

** ** **

జేసిండ్లు. ఆదివారం రానే వచ్చింది. పంచాయితంటే అన్ని కులాల పెద్ద మనుషులు సంకలెగిరేత్తరు తాగుడు, బుక్కుడు దొరుకుతదని.

నాగారం తాళ్లల్లకు ఆదివారం పొద్దున్నే రెండూళ్ల పెద్దమనుషులు జేరిండ్లు. రెండు కులాల మధ్య సమస్య కాబట్టి మధ్యవర్తులుగా ఉంటారని వేరే కులాల పెద్దమనుషులను కూడా పిలుసుకచ్చిండ్లు. తమ ప్రమే యాలు లేకుండానే లచ్చిమి, రవి ఎవరికి వాళ్లు నాగారం తాళ్లల్లకు చేరిండ్లు.అటు పెద్ద గుంపే ఉన్నది. ఇటు పెద్ద గుంపే ఉన్నది. వాదనలు మొదలైనాయి. ఎవలకు తోసినట్టు వాళ్లు మాట్లాడుతాండ్లు.

"అసలు శాలోడు, తెనుగోళ్ల పోరిని జేసుకునుడే తప్పు" అని ఒక పెద్దమనిషి అంటడు. "అవునే...వీళ్లు ఎవలనడిగి లేసిపోయిన్లె, ఇప్పుడు ఇడుపు కాయితానికి మనకాడికిచ్చంద్రు" అని ఇంకో పెద్ద మనిషి లా పాయింటు తీసిండు.

"అరె... ముల్లుబోయి ఆకు మీద పడ్డ, ఆకుబోయి ముల్లు మీద పడ్డ,కట్టం ఆకుకే గదనోయి"అని ఇంకో పెద్దమనిషి జోపుకచ్చిండు.

ఒకనికంటే ఒగడు ఎక్కువ మాట్లాడుతాండ్లు.

అటు లచ్చిమి అయ్యవ్వలు,ఇటు రవి అవ్వనాయన బొమ్మలోలె కూసున్నరు. వాళ్ల మాటలను పట్టించుకునేటోల్లే లేరు.

"పోరికి కడుపే కాలేదాయె, ఇడుపు కాయితం చేసుడే"అని పెద్ద మనుషులు తీర్పు జెప్పిండ్లు.

రవిగాడు పోరిని లేప్కబోయినందుకు పదివేలు దండుగ కట్టాల్సిందే అన్నరు.

తీర్పు ఎవ్వరు కాదన్నా కులం కట్టుబాట్లంటూ కొత్త పంచాయితి. నీరు, నిప్పు బందంటరు. ఎవ్వనికచ్చిన పీకులాటని, పెద్ద మనుషుల తీర్పును ఎవ్వలు తప్పుబట్టలె.

కుల పెద్ద మనుషులకు పంచాయతులంటే పండుగ వచ్చినంత సంబురం. జాతర తీరుగా అందరు జమగూడుతరు. పొలగాండ్లను చెరికొంత తప్పొందనిపించి ఒకటి చేస్తరని రాధవ్వ అనుకున్నది. కాని వాళ్ళు ఇడుపుకాగితం ఇప్పించుటానికే చూస్తున్నరని తెలిసి పోయి మనసు కొట్టుకున్నది. లచ్చిమి, రవిగాడు ఎంత మంచిగా కలిసి ఉందురో అన్ని యాదికచ్చి రాధవ్వకు మనసంతా ఎట్లనో అయింది.

"మంచి నౌకరి, మంచి జీతం ఉంటే ఆళ్ల బతుకులు గిట్ల గాకపోవు" అని రాధక్క ఒకటికి పదిసార్లు చెప్తనే ఉన్నది. ఆ మాట ఎవల చెవులకు ఎక్కుతలేదు.

తీర్పు జెప్పుడయ్యిందో లేదో లొట్లకు లొట్లు కల్లు దిగుతనే ఉన్నది. కోడిపిల్లల మెడలు తెగుతనే ఉన్నయి. వంటలు మొదలైనయి.

పోరగాళ్లను వుట్టిగనే ఇడగొట్టిరని జంపయ్య, నర్సయ్య దంపతుల గుండెలు మండుతున్నట్టే పొయ్యి కింద కట్టెలు లగాంచి మండుతానయి. పెద్ద మనుషులను, వారి తీర్పును ధిక్కరించలేని నిస్సహాయ స్థితిలో లోలోన కోపంతో వాళ్ల రక్తం మసులుతున్నట్టే అన్నం ఎసరుకచ్చి ఉడుకుతాంది.

అప్పటికే గుడాలు బుక్కుకుంట కడుపునిండ కల్లు తాగిన పెద్ద మనుషులు ఒర్రేది ఒర్రుతున్నరు.

నాగారం తాళ్లల్ల అంతా జాతర వాతావరణం కనిపిస్తున్నది. అటు పక్క లచ్చిమి, ఇటుపక్క రవి మౌనంగా కూసున్నరు.

సొల్లు కార్సుకుంట పెద్ద మనుషులు కోడి మాంసం నంజుకుంటాంటే రవి, లచ్చిమి కండ్లళ్లకెల్లి నీళ్లు కారుతున్నయి.

మమ్ములను ఎవ్వలు సూత్తలేరని అటు ఇటూ జూసిన రవి, లచ్చిమి కూసున్నకానించి ఒకేపాలి లేసిండ్లు. పరకాల రోడ్డు పట్టింద్రు.

వాళ్ళు రోడెక్కడం జూసిన జంపయ్య, నర్సయ్య దంపతుల ముఖాలు ఆనందంతో వికసించాయి.

పంచాయతీ పెద్ద మనుషులు సోయి లేకుండా ఇంకా ముచ్చట్లు పెట్టుకుంట ఇడుపుకాయిదం పంచాయతి జాతర సాగిస్తనే ఉన్నరు. కులం గాని కులం పోరగడాండ్లు చేసుకున్న పెండ్లి ఇడుపు కాగితం చేసినందుకు ఇడగొట్టటానికి ఎంతెంత కట్టపడ్డరో, సొల్లుగారంగ నరుకుతనే ఉన్నరు.

●


## 20 గంటలలో ఫలితం ప్రారంభం

### "తెల్లమచ్చలు"

తెల్లమచ్చల వ్యాధి అసాధ్యం కాదు. ఇతర వ్యాధులలాగా సరియైన సమయానికి చికిత్స పొందినచో 100% నయమగును. మా చికిత్స ద్వారా వేలాది మంది రోగులు విముక్తి పొందియున్నారు మరియు ప్రశంసాపత్రములు పంపుచున్నారు. మా చికిత్స ఆరంభించిన 20 గంటలలో మచ్చల యొక్క రంగు మారుతుంది. అన్ని మచ్చలు 100% గ్యారంటీతో తొందరగా నయమగుతుంది మరియు సహజ శరీర రంగుగా మారుతుంది. 15 రోజుల మందు ఉచితం. వెంటనే చికిత్స కొరకు ఉత్తరం వ్రాయండి లేదా ప్రధాన వైద్యులకు ఫోన్ చేయండి.

## స్త్రీ, పురుషుల గుప్త రోగములకు చికిత్స

చిన్న వయస్సులో చెడు అలవాటు వలన ధాతుక్షీణత, నపుంసకత్వం, శీఘ్రస్కలనము, స్వప్న దోషము, మల మూత్రంలలో వీర్యం పోవుట, వీర్యకణాల సంఖ్య తక్కువగా వుండుట, అంగదోషము (చిన్నదిగా, మెత్తగా, వంకరగా వుండుట, సంతానం కలగకపోవుట, వైవాహిక జీవితం నిరాశగా ఉండుట, స్త్రీకి ఋతుస్రావంలో నొప్పిగా, మంటగా వుండుట, లీకోరియా (తెల్లబట్ట, ఎర్రబట్ట అగుట) నడుమునొప్పి, వక్షోజములు వ్రేలాడుట, చిన్నదిగా వుండుట, మళ్ళీ మళ్ళీ ఆడపిల్ల పుట్టుట, మొదలగు స్త్రీ, పురుష సంబంధిత వ్యాధులతో బాధపడుచున్నవారు మా చికిత్స పొందిన 20 గంటలలో ఫలితము ప్రారంభమగును. మీ వ్యాధులు 100% గ్యారంటీతో నయమగును. 15 రోజుల మందు ఉచితం. వెంటనే చికిత్స కొరకు ఉత్తరం వ్రాయండి లేదా ఫోన్ ద్వారా సంప్రదించగలరు.

**గమనిక :** మావద్ద అంగం పెద్దది అగుటకు యంత్రం కలదు. దీని ధర 450/- రూపాయలు, ఫలితం లేదంటే డబ్బులు గ్యారంటీగా తిరిగి ఇవ్వబడును.

## తల వెంట్రుకలు తెల్లబడుట, రాలుటకు చికిత్స

మా ఆయుర్వేద చికిత్స ద్వారా సమయానికి ముందు వెంట్రుకలు తెల్లబడుట, రాలుట, చుండ్రు నిలిచిపోవును. వెంట్రుకలు నల్లగా, దట్టముగా మరియు పటిష్టముగా నుంచును. మెదడు, కళ్లు చల్లగా నుంచును. తలనొప్పిని కూడా దూరం చేస్తోంది. వెంటనే చికిత్స కొరకు ప్రధాన వైద్యులకు వ్రాయండి.

**ఇతర రోగములు :** కడుపు నొప్పి, మూలవ్యాధి, ఆస్తమా - దమ్ము, నడుము, కీళ్ళు (మోకాళ్ళు) నొప్పులు, ఏనుగు కాళ్ళులాగా వుండుట మొదలగు సమస్యలకు ఆయుర్వేద పద్ధతి ద్వారా చికిత్స చేయబడును.

**Add : Vaidya Surya Prakash (H-2)**
**P.O.Katri Sarai (Gaya) 805105**
**Phone No. : 06112-289413, 289352**
**Mobile No.: 09431025437**